భండారు అచ్చమాంబ

# సచ్చరిత్ర



కొండవీటి సత్యవతి

# భండారు అచ్చమాంబ

# సచ్చరిత్ర

కొండవీటి సత్యవతి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : 50/-

తొలి ముద్రణ : జూన్, 2012

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126, శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఈ పుస్తకం రాయడం వెనుక... | iv |
| 2. | తెలుగు సాహిత్యంలో ధృవతార భండారు అచ్చమాంబ | 1 |
| 3. | తొలి కథకురాలు | 18 |
| 4. | అచ్చమాంబ రాసిన వ్యాస సముదాయం | 28 |
| 5. | స్త్రీల సమాజ స్థాపనము/బృందావన సమాజం | 36 |
| 6. | అక్కాతమ్ముళ్ళ అనుబంధం | 42 |
| 7. | అచ్చమాంబ మరణం | 46 |
| 8. | ముగింపు | 48 |


## అనుబంధం


| | | |
|---|---|---|
| 1. | కృతి విమర్శనము -1 (సమీక్షావ్యాసం) | 56 |
| 2. | కృతి విమర్శనము-2 (పుస్తకసమీక్ష) | 58 |
| 3. | కీర్తి శేషురాలగు అచ్చమాంబ (స్మరణ) | 60 |
| 4. | అచ్చమాంబ మరణించినపుడు | 64 |
| 5. | వేమవర్పు మహాలక్ష్మమ్మ-ఆహ్వానపత్రిక | 68 |
| 6. | ఏలూరు పట్టణంలో అచ్చమాంబ ప్రసంగం | 70 |
| 7. | కాకినాడలో అచ్చమాంబ ఇచ్చిన ఉపన్యాసం | 76 |
| 8. | బందరులో బృందావన సమాజ స్థాపనసందర్భంగా ఇచ్చిన ఉపన్యాసం | 85 |
| 9. | ఉపయుక్త గ్రంథాలు, వ్యక్తులు | 92 |

# ఈ పుస్తకం రాయడం వెనుక...

భండారు అచ్చమాంబ గురించి నేను మొదటిసారి చదివింది 1991లో సూసీతారు, కె. లలితల సంయుక్త సంపాదకత్వంలో వెలువడిన " Women Writing in India: 600 BC to the present, Volume I, 600 BC to the early 20th century, Volume II" పుస్తకంలో. ఈ పుస్తకంలో తొలిసారి భండారు అచ్చమాంబ జీవితం గురించి రాసారు. అచ్చమాంబ అసమాన ప్రజ్ఞాపాటవాల గురించి, ఆమె రచనల గురించి చాలా విపులమైన వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. 1901 సంవత్సరంలో అచ్చమాంబ రాసిన "అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథం కందుకూరి వీరేశలింగంగారి 'చింతామణి' పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైందని, ఆమె మూడు భాగాలుగా ఈ పుస్తకాన్ని రాయదలిచిందని పేర్కొన్నారు.

చరిత్ర చీకటిలో మినుకు మినుకుమంటున్న భండారు అచ్చమాంబను తెరమీదకు తెచ్చి, తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన సేవల మీద వెలుగును ప్రసరించిన పుస్తకం "వుమెన్ రైటింగ్ ఇన్ ఇండియా". ఈ పుస్తకం కోసం, తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా చదివి, పరిశీలించిన కె.లలిత, తెలుగులో తొలి కథ రాసింది భండారు అచ్చమాంబేనని ప్రమాణపూర్వకంగా ప్రకటించింది. అంతేకాదు భారతీయ స్త్రీల చరిత్రలను అబలాసచ్ఛరిత్ర రత్నమాలగా గుదిగుచ్చిన అచ్చమాంబే ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణి అని, స్త్రీలను ఐక్యపరుస్తూ, స్త్రీల కోసం మొట్టమొదటిసారి "బృందావనం స్త్రీల సమాజాన్ని" స్థాపించిన ఘనత కూడా అచ్చమాంబకే దక్కుతుందని ఈ పుస్తకం నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

అచ్చమాంబను ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా ప్రకటిస్తూ స్త్రీవాద పత్రిక భూమిక జనవరి–మార్చి 1993 సంచికలో కె. లలిత వ్యాసం రాసింది. 1998 సంవత్సరంలో భూమిక, అన్వేషి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు కథ, నిర్మాణం, పరిధి, వైవిధ్యం" మీద మూడు రోజుల వర్క్‌షాప్ జరిగింది. ఆ వర్క్‌షాప్‌లో కాళీపట్నం రామారావు మాస్టారు, కేతు విశ్వనాథరెడ్డి, వాసిరెడ్డి సీతాదేవి, పి. సత్యవతి, అబ్బూరి ఛాయాదేవి, అల్లం రాజయ్య,



ఓల్గా, వల్లంపాటి వెంకటసుబ్బయ్యలాంటి హేమా హేమీలందరూ పాల్గొన్నారు. ఎందరో కొత్త కథకుల్ని తెలుగు సాహిత్యానికి అందించిన, పరిచయం చేసిన వర్క్‌షాప్ అది. ప్రతిమ, శిలాలోలిత, తుర్లపాటి లక్ష్మి, అనిశెట్టి రజిత లాంటి రచయిత్రుల్ని భూమికకు దగ్గర చేసిన సమావేశాలవి.

ఆనాటి రెండోరోజు కార్యక్రమంలో కె.లలిత "సంఘ సంస్కరణోద్యమం – స్త్రీల కథలు" అనే అంశం మీద మాట్లాడుతూ 1910లో వచ్చిన గురజాడ 'దిద్దుబాటు' మొదటి ఆధునిక కథ అంటున్నారు విమర్శకులు, కానీ 1902లో భండారు అచ్చమాంబ రాసిన "ధనత్రయోదశి"ని ఎందుకు మొదటి కథగా పరిగణించడం లేదు? అని ప్రశ్నించారు. ఆ రోజు దాని మీద ఏమి చర్చ జరిగిందో నాకు గుర్తు లేదు కానీ ఈ వర్క్‌షాప్ రిపోర్ట్‌ను అద్భుతంగా రాసిచ్చిన అబ్బూరి ఛాయాదేవిగారు లలిత మాటల్ని యధాతథంగా రాసారు. 1998 మార్చి భూమికలో ఈ రిపోర్ట్‌ను ప్రచురించినపుడు అచ్చమాంబ మళ్ళీ నా ఆలోచనల్లోకి వచ్చి చేరింది. 'ధనత్రయోదశి' కథలో ఏముందో చూడాలన్పించింది. అన్వేషి లైబ్రరీలో వెతికాను. వేటపాలెం లైబ్రరీ నుంచి సేకరించి తెచ్చి, అన్వేషి లైబ్రరీలో భద్రపరిచిన అలనాటి స్త్రీల పత్రికలు హిందూసుందరి, తెలుగు జనానా, గృహలక్ష్మి, సావిత్రి, సతీహితబోధిని మొదలైన పత్రికలు తిరగేస్తుంటే హిందూసుందరి 1903 నాటి సంచిక నా కళ్ళబడింది. అందులోనే 'ధనత్రయోదశి' కథ ప్రచురితమైంది. ఆ కథని చదివినపుడు నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో 'కథ' అనే ప్రక్రియ తెలియక ముందే అచ్చమాంబ అంత అద్భుతమైన కథ ఎలా రాయగలిగిందా? అనే ఆసక్తితో ఆమె జీవితం గురించి తెలుసుకోవాలని, అసలీ అచ్చమాంబ ఎవరు? అంటూ తవ్వనారంభించి, ఆవిడ రాసిన భారతీయ స్త్రీల చరిత్ర గ్రంథం "అబలా సచ్చరిత్ర రత్నమాల' చూసి మరింత ఆశ్చర్యానికి గురయ్యాను.

అచ్చమాంబకు సంబంధించి అన్వేషి లైబ్రరీలో అందుబాటులో వున్న సమస్తాన్ని ఫోటోకాపీ చేయించి తెచ్చుకుని నా లైబ్రరీలో భద్రపరుచుకున్నాను. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ "ఆంధ్ర కవయిత్రులు", 'అబలా సచ్చరిత్ర రత్నమాల", హిందూసుందరి పత్రికలు అన్నీ సేకరించుకుని ఎప్పటికైనా భండారు అచ్చమాంబ గురించి రాయాలనుకున్నాను. తర్వాత చాలాకాలం ఆ విషయం మర్చిపోయాను. 2003లో ఓ రోజు కాత్యాయనీ విద్మహే ఫోన్ చేసి "తెలుగు సాహిత్యంలో జండర్ స్పృహ" మీద జాతీయ స్థాయి యుజిసి సెమినార్ పెడుతున్నామని ఏదైనా పేపర్ స్త్రీల అంశం మీద రాయమని కోరినపుడు నేను అచ్చమాంబ మీద రాస్తానని చెప్పాను.

రిసెర్చి స్టూడెంట్స్ శోధించిన తరహాలో మళ్ళీ అచ్చమాంబ మీద దొరికిన సమాచారమంతా చదివాను. ఇంత అద్భుత, ప్రతిభామూర్తిని తెలుగు సాహిత్యం ఎంత

నిర్లక్ష్యంగా పక్కకు పెట్టేసిందో అర్ధమై ఆవేశంతో పాటు ఆవేదన కూడా కలిగింది. "తొలి తెలుగు కథకురాలు భండారు అచ్చమాంబ" పేరుతో చాలా పెద్ద వ్యాసం రాసి వరంగల్‌లో ఆనాటి యుజిసి సెమినార్‌లో చదివాను. ఆ వ్యాసం రాస్తున్నపుడు నేను అనుకోలేదు, భండారు అచ్చమాంబని, గురజాడకు పోటీగా నిలబెడతానని. గురజాడ రాసిన అన్ని కథలూ చదివాను. అచ్చమాంబ కథలూ చదివాను. ఈవిడ పన్నెండు కథలు రాసింది. ఆయన ఐదో, ఆరో రాసారు. గురజాడ 1910లో దిద్దుబాటు రాసారు. అచ్చమాంబ1902 ధనత్రయోదశి రాసింది. ఈ వాస్తవాన్ని అంగీకరించడంవల్ల గురజాడ ఖ్యాతికొచ్చిన నష్టం ఏమి లేదు. ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది అని చెప్పిన మహాకవి గురజాడ, అచ్చమాంబను కథకు ఆద్యురాలుగా ఒప్పుకోవడానికి సంశయం చూపి వుండేవాడు కాదు అన్నది వాస్తవం. ఆయనంతటి విశాలభావాలున్నవాడు.

అయితే తెలుగు సాహిత్య విమర్శకులకు అంత విశాల మనస్తత్వం లేదన్నది ఇప్పటి విషాదం. తొలి తెలుగు కథ మీద పది, పదిహేను సంవత్సరాలుగా తీవ్రమైన చర్చ జరుగుతున్నది. ఎండ్లూరి సుధాకర్ ప్రయత్నంవల్ల తొలి కథకురాలుగా తెలుగు యూనివర్సిటీ తెలుగు ఎమ్.ఏ పాఠ్యాంశంగా చేరగలిగింది అచ్చమాంబ. దీనికి సహకరించిన వారు అప్పటి తెలుగు యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆవుల మంజులతగారు.

అచ్చమాంబ ఒక్క కథలోనే కాదు మరెన్నింటిలోనో ప్రథమురాలుగా కీర్తినందుకోవలసివున్నది. ఆమె జీవించిన 30 సంవత్సరాల అతి తక్కువ కాలంలో ఆమె సాధించిన విజయాలు చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. అప్పటివరకు స్త్రీల చరిత్రలను ఎవ్వరూ గ్రంథస్థం చెయ్యలేదు. ఆమె కేవలం తెలుగు స్త్రీల చరిత్రలనే కాక,ఎన్నో కష్టాలకోర్చి వివిధ భాషల్లోని భారతీయ స్త్రీల అద్భుత చరిత్రలను సేకరించి, తెలుగీకరించి "అబలాసచ్చరిత్ర రత్నమాల" పేరుతో గ్రంథం రాసింది. తెలుగులో స్త్రీ చరిత్రలతో నిండిన మొట్టమొదటి పుస్తకమిదే. అచ్చమాంబే ప్రథమ స్త్రీల చరిత్రకారిణిగా చరిత్రలో నిలిచిపోయింది.

భారత స్వాతంత్రోద్యమం నడుస్తున్న రోజుల్లోనే అచ్చమాంబ బతికింది. అప్పటివరకు స్త్రీలకోసం సంఘాలు ఏర్పడిన దాఖలాలు లేవు. ఆ పనికి కూడా అచ్చమాంబే పూనుకున్నది. బందరులో తొలి స్త్రీ సమాజం "బృందావనం స్త్రీ సమాజం" ఏర్పాటు చేసింది. స్త్రీలను ఐక్యపరిచి, వారు ఇంటి నుండి బయటికొచ్చి ఈ సంఘాల్లో పనిచేసేలా స్ఫూర్తినిచ్చిన ఘనత అచ్చమాంబదే. ఆయా సమావేశాల్లో ఆమె యిచ్చిన ఉపన్యాసాలు చదివితే ఆమె ఎంత జ్ఞానాన్ని సంపాదించిందో, ఎన్ని విషయాల గురించి మాట్లాడేదో, 'స్త్రీవిద్య' ఆమెకు



ప్రియమైన విషయంగా ఎలా మారిందో అర్థమౌతుంది. ఈ ఉపన్యాసాలన్నింటిని హిందూసుందరి పత్రిక ప్రచురించింది. వీటన్నింటిని పుస్తక రూపంలో తీసుకురావల్సిన అవసరం ఎంతైనా వుంది.

ముఖ్యంగా అచ్చమాంబ కథల్ని సంకలనం చేసిన శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు మాత్రమే చాలదు. బోలెడన్ని ధన్యవాదాలు. ఎందుకంటే ఆయన యిచ్చిన సమాచారం ప్రకారమే జితేంద్రబాబుని కలిసాను. ఆయన ఎన్నో పుస్తకాలను ఇచ్చారు. ముఖ్యంగా నిడదవోలు వెంకట్రావుగారి అచ్చమాంబ జీవితకథ (అముద్రితం), కొమర్రాజు లక్ష్మణరావుగారి మీద వేసిన "తెలుగుతల్లి" ప్రత్యేక సంచిక, "లక్ష్మణరాయవర్ధంతి" సంచికలు నాకు ఈ పుస్తక రచనలో ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ పుస్తకం ద్వారానే రాచమళ్ళ సత్యవతీదేవి అనే సంపాదకురాలు గురించి, ఆవిడ నడిపిన తెలుగుతల్లి పత్రిక గురించి, ఆవిడ దగ్గర అడివి బాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి ప్రముఖులు సహసంపాదకురాలుగా పనిచేసారనే అపురూప విషయం తెలిసింది. శ్రీ జితేంద్రబాబుగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఇక అన్వేషి లైబ్రరీలో భద్రపరిచిన పాతపత్రికలు లేకపోతే ఈ పుస్తక రచన జరిగేదే కాదు. అసలు అచ్చమాంబే రంగం మీదికి వచ్చేది కాదనడం అతిశయోక్తి కాదు. అన్వేషిలో పనిచేసే రవీందర్ ఎప్పుడు కావాలంటే అప్పుడు జిరాక్స్ చేసి ఇచ్చేవారు. ఆయనకి కృతజ్ఞతలు. అలాగే లైబ్రేరియన్‌లు లక్ష్మి, కనీజ్‌లకు ధన్యవాదాలు. పుస్తకాలు ఎలా చాప్టర్లుగా విడగొట్టాలో, ఎలాంటి శీర్షికలు పెట్టాలో సూచనలిచ్చిన మిత్రురాలు శిలాలోలితకి, అచ్చమాంబ ఎంతవరకు వచ్చింది, రాస్తున్నావా? లేదా అంటూ వెంటబడిన నేస్తం గీతకి, అది వాళ్ళ స్నేహధర్మం కాబట్టి థాంక్స్ చెప్పడం లేదు. ఈ పుస్తకాన్ని డి.టి.పి. చేసిన మాధవికి, పేజీలను సక్రమంగా అమర్చి ఇచ్చిన ప్రసన్నకి థాంక్స్. డ్రాఫ్ట్ ప్రతిని పరిశీలించిన అబ్బూరి ఛాయాదేవిగారికి, మేలు ప్రతిగా నేను భావించిన దానికి ఎన్నో మార్పులు, చేర్పులు సూచిస్తూ, చక్కటి సలహాలు ఇచ్చిన కె.లలితకి మనఃపూర్వక కృతజ్ఞతలు.

చివరగా ఒక ముఖ్య విషయం గురించి రాయాలి. అది అచ్చమాంబ ప్రాంతీయతకు సంబంధించిన అంశం. అచ్చమాంబ తెలంగాణా ప్రాంతానికి చెందిన రచయిత్రి అని సంగిశెట్టి శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి, జితేంద్రగార్లతో పాటు చాలామంది కూడా భావిస్తున్నారు. దీనితో నాకేమీ అభ్యంతరం లేదు. అచ్చమాంబ పుట్టి, పెరిగిన మునగాల సంస్థానం వాస్తవంగా కృష్ణాజిల్లాలో వుండేది. ఆ తరువాత నల్గొండ జిల్లా దేవరకొండ

ప్రాంతంలో కలిసింది. అచ్చమాంబకి అయిదారేళ్ళ వయస్సున్నపుడే తల్లి ఆమెను నాగపూర్ తీసుకెళ్ళిపోయింది. మళ్ళీ ఎపుడూ ఆమె ఆంధ్రదేశం వచ్చిపోవడం తప్ప ఎక్కడా నివసించలేదు. ఆమె రచనల్లో హైదరాబాద్ ప్రస్తావన వుంది కానీ మరే తెలంగాణ ప్రాంతం గురించి రాయలేదు. ఆంధ్ర ప్రాంతాల గురించిన ప్రస్తావన ముఖ్యంగా గోదావరి తీరప్రాంతం గురించి, గౌతమి, గోదావరి గురించి రాసింది.

అచ్చమాంబ రచనలు అచ్చయిన ఆనాటి పత్రికలు హిందూసుందరి, తెలుగు జనానా, సావిత్రి మొదలైనవి ఆంధ్రప్రాంతం నుండే వెలువడడంవల్ల కూడా ఆమె ఆ ప్రాంతానికి ఎక్కువసార్లు ప్రయాణాలు చెయ్యడం, వాటిని గురించి తన రచనల్లో ప్రస్తావించడం చేసి వుండవచ్చు. తండ్రి మరణం తర్వాత. ఆయన దివాన్‌గిరీ చేసిన మునగాల సంస్థానానికి అచ్చమాంబ మళ్ళీ వెళ్ళిన దాఖలాలు ఎక్కడా లేవు.

పుట్టుక ప్రాతిపదికగా తీసుకుంటే భండారు అచ్చమాంబ తెలంగాణాకు చెందిన గొప్ప రచయిత్రి. దీనికి రెండో అభిప్రాయం లేదు. అయితే ఆమెను ప్రాంతాలకు అతీతంగానే చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆమె పుట్టుక మాత్రమే తెలంగాణలో. పెరిగింది, జీవించింది,రచయిత్రిగా రాణించింది మహారాష్ట్రలో, అక్షరబద్ధం చేసింది భారత స్త్రీల చరిత్రలు. అందుకే నా ఉద్దేశ్యంలో అచ్చమాంబ అసమాన ప్రజ్ఞావంతురాలైన భారతీయ రచయిత్రి. నిజానికి ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు రావాల్సిన అవసరం వుంది. ఈ పుస్తకాన్ని అన్ని భారతీయ భాషల్లోకి, ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువదించాల్సివుంది. ఆమెను ఎవరైనా సొంతం చేసుకోవచ్చు. ఆంధ్రప్రాంతం వాళ్ళు ఆంధ్ర రచయిత్రి అని, తెలంగాణావారు తెలంగాణా రచయిత్రి అని భావించుకోవచ్చు. ఎవరేం అనుకున్నా అచ్చమాంబ మాత్రం అనితరసాధ్యమైన మార్గంలో పయనించి, తొలి స్త్రీల చరిత్రకారిణిగా, కథకురాలుగా, స్త్రీల సమాజాల స్థాపకురాలుగా ముప్పేటహారాన్ని ఠీవిగా ధరించి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన దార్శనికురాలు భండారు అచ్చమాంబ.

కొండవీటి సత్యవతి
ఏప్రిల్ 2012

# తెలుగు సాహిత్యంలో ధృవతార
# భండారు అచ్చమాంబ

భండారు అచ్చమాంబ నూటపది సంవత్సరాల క్రితం 'అబలా సచ్చరిత్ర రత్నమాల' (భారత వీరనారీమణుల జీవిత సంగ్రహము) పుస్తకరచనకు పూనుకుంటూ, తాను ఆ పుస్తకాన్ని ఎందుకు రాయాలనుకున్నదో ఉపోద్ఘాతంలో ముఖ్యఉద్దేశ్యంగా రాసింది.

"స్త్రీలు అబలలనియు, బుద్ధిహీనులనియు, వివేకశూన్యులనియు, సకల దుర్గుణములకు నివాస స్థలమనియు గొందరు నిందింతురు. స్త్రీల పయిన మోపబడిన యీ దోషారోపణములన్నియు నబద్ధములనియు స్త్రీలలో నత్యంతశౌర్యధైర్యవంతులు, అసామాన్య విద్యావిభూషితలును, జ్ఞానవతులును, రాజ్యకార్యదురంధురత్వము గలవారును, స్వదేశాభిమానులును, సకల సద్గుణ విభూషితలును, బూర్వముండిరనియు నిప్పుడున్నవారనియు స్థాపించుట నా మొదటి యుద్దేశ్యము."

"స్త్రీలకు విద్య నేర్పిన యెడలను, వారికి స్వాతంత్ర్యమొసగిన యెడలను వారు చెడిపోవుదురనియు, బతుల నవమానించెదరనియు, గుటుంబ సౌఖ్యమును నాశము చేసెదరనియు గొందరు మహానుభావులు వక్కాణించెదరు. ఈ యారోపణములన్నియు నిరర్థకములనియు స్త్రీవిద్య దురాచార ప్రతీకారానుకూలమగునేగాని దురాచార ప్రవృత్త్యనుకూలము గానేరదనియు, స్త్రీవిద్యాస్వాతంత్ర్యముల వలన మనదేశమునకు లాభమే గానీ నష్టము గలుగనేరదనియు స్త్రీవిద్య యత్యంతావశ్యకంబనియు సోదాహరణపూర్వకముగా నిరూపించుట నా ద్వితీయోద్దేశ్యము".

అచ్చమాంబ ఈ మాటలు రాసింది 1900 సంవత్సరంలో అన్నది గుర్తుపెట్టుకోవాలి. దాదాపు నూటపది సంవత్సరాల క్రితం భండారు అచ్చమాంబ స్త్రీలకోసం ఆలోచించినతీరు మిక్కిలి ఆశ్చర్యం గొలుపుతుంది. అప్పటివరకు ఎవ్వరూ పూనుకోని స్త్రీల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టి, ఆ చరిత్ర రాయడానికి గల కారణాలను చాలా స్పష్టంగా ప్రకటించింది 'అబలా సచ్చరిత్ర రత్నమాల' పుస్తకంలో.

"మనదేశంలోని స్త్రీవాద చరిత్రకారులలో ప్రథమస్థానం ఎవరిది అనే ప్రశ్నకు సమాధానం భండారు అచ్చమాంబ అని చెప్పటంలో అతిశయోక్తి లేదు."[1] స్పష్టమైన ఆలోచనలతో, ఒక రాజకీయ కారణంతో తొలి స్త్రీల, చరిత్ర రచనకు పూనుకున్న అచ్చమాంబ చదువుకున్నది అంతంత మాత్రమే. పదవఏటవరకు అక్షరం ముక్కరాని భండారు అచ్చమాంబ తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి కథ రాయడమేకాక ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా వినుతికెక్కింది. 1902-1903 మధ్యకాలంలో అచ్చమాంబ ఎన్నో వ్యాసాలను, కథలను రాసింది. అవన్నీ హిందూసుందరి, సరస్వతి, సావిత్రి, తెలుగు జనానా పత్రికలలో ప్రచురితమయ్యాయి. స్త్రీ విద్యకోసం ఆమె పడిన తపన అంతా ఇంతా కాదు. ఈ అంశమై ఎన్నో వ్యాసాలు రాసింది. ఏ ఊరు వెళ్ళినా ఆ ఊరి మహిళలను కలిపి సమావేశాలు నిర్వహించేది. స్త్రీవిద్య ఆవశ్యకత గురించి ఉపన్యాసాలు యిచ్చేది. స్త్రీలకోసం సంఘాలు ఏర్పాటు చేసింది.

"ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధించబడిన స్త్రీలు రక్షితురాండ్రు కారు. ఏ స్త్రీలు, తమ యాత్మను తామే కాపాడుకుందురో వారే సురక్షితురాండ్రు"[2] అనే అర్థమొచ్చే సంస్కృత శ్లోకంతో తన అబలా సచ్చరిత్ర రత్నమాల పుస్తకాన్ని ప్రారంభించిన అచ్చమాంబ ఎంత పురోగామి దృక్పథంతో ఆలోచించేదో, స్త్రీస్వేచ్ఛను తనదైన పద్ధతిలో ఎలా ప్రతిపాదించిందో పై పద్యం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

## అచ్చమాంబ జననం, బాల్యం

భండారు అచ్చమాంబ కృష్ణా జిల్లాలోని నందిగామ గ్రామంలో 1874లో జన్మించింది. అచ్చమాంబ తాత, అమ్మమ్మలు నందిగామలో నివసించారు. ఆమె తాతగారు ఆ ప్రాంతంలోని జమిందారు పనిమీద నందిగామలో నివసించేటపుడు అచ్చమాంబ జన్మించింది. ఆమె తాతగారి స్వంత గ్రామం కంచెల. ఆమె తండ్రి తరఫు, తాత, నానమ్మల గ్రామం పెనగంచిప్రోలు.

అచ్చమాంబ పెనగంచిప్రోలు గ్రామం గురించి తన 'అబలా సచ్చరిత్ర రత్నమాల'లో వివరంగా రాసింది. పెనగంచిప్రోలు పూర్వం చాలా పెద్ద పట్టణంగా విలసిల్లిందని, అక్కడ భూమిని తవ్వినపుడు గుళ్ళరాళ్ళు, మేడల స్తంభాలు, దూలాలు, శిలాశాసనాలు బయటపడి, ఆ పట్టణం ఒకప్పుడు గొప్ప పట్టణంగా వుండేదని రాసింది. అంతేకాక కొమర్రాజుగారు

1. *ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణి - భండారు అచ్చమాంబ (1874-1904) కె. లలిత స్త్రీవాద పత్రిక భూమిక జనవరి-మార్చి 1993.*

2 *అబలా పచ్చరిత్ర రత్నమాల - భారత వీర నారీమణుల జీవిత సంగ్రహములు గ్రంథ కర్త కీ.శే. శ్రీమతి భండారు అచ్చమాంబగారు*



పూర్వకాలమునుంచీ ఆ పట్టణమే నివాసస్థలంగా కలిగి వుండేవారనికూడా అచ్చమాంబ రాసింది.

అచ్చమాంబ తండ్రి పేరు కొమర్రాజు వెంకటప్పయ్య, తల్లి గంగమాంబ. విజ్ఞాన చంద్రికా మండలిని నడిపిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు ఈమె సోదరుడు.

అచ్చమాంబ తండ్రి వెంకటప్పయ్య కృష్ణామండలంలోని మునగాల సంస్థానంలో 1880 వరకు దివాన్‌గిరి చేసారు. ఈయన పన్నెండు సంవత్సరాల పాటు దివాన్‌గిరి నిర్వహించి, గొప్ప పరోపకారిగా పేరుపొందారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి పరులకు ఉపకారం చేయాలనే సద్గుణం అచ్చమాంబకు తన తండ్రినుండి సంక్రమించిందనడంలో ఎలాంటి సందేహము లేదు. ఆమె దుఃఖాన్ని తనలోనే దాచుకోవడం చిన్నప్పటినుండే అలవరుచుకుందా అన్నట్టు - బాల్యంలో జరిగిన ఈ ఉదాహరణ చెబుతుంది.

అచ్చమాంబకి ఆరేడు ఏళ్ళ వయసపుడు ఒకరోజు ఆమెను తేలుకుట్టింది. తేలు కుట్టినపుడు నొప్పి ఎంత తీవ్రంగా వుంటుందో అందరికీ తెలుసు. అచ్చమాంబ మాత్రం దుఃఖాన్ని లోలోపలే అణుచుకుందిగానీ ఎవ్వరికీ చెప్పలేదు. పెదబొబ్బలు పెట్టి ఏడ్వకుండా లోలోపలే దుఃఖిస్తున్నప్పుడు, ఎలాగోలా యింట్లోనివారు కనిపెట్టి ఎందుకు బాధపడుతున్నావని అడిగినపుడే ఆమె తేలు కుట్టిందని చెప్పింది.

"ఇట్టి సహిష్ణుతను అప్పుడింటివారు దుర్గుణములుగా నెంచుచుండిరి గానీ యిట్టి సామర్థ్యముల వలననే యీమె తరువాత పుత్రవిహారాది సంసారిక దుఃఖములను సహింపగలిగినదని నా తాత్పర్యము" అని హిందూసుందరి సెప్టెంబరు-అక్టోబరు 1903 సంచికలో బాలాంత్రపు శేషమ్మగారు అచ్చమాంబ మీద రాసిన సంపాదకీయంలో పేర్కొన్నది.

అచ్చమాంబ చిన్నప్పటినుండే అనేక పనులు చేయడంలో చాలా ఉత్సాహం కనపరిచేది. పెద్దవాళ్ళు చేసే పనుల్లో తాను చేరి ఆయాపనులు చేయడానికి ప్రయత్నిస్తూ పెద్దల దండనలకు కూడా గురయ్యేది.

"చిన్ననాటినుండియు నిట్లు పనులయందు ఉత్సాహము గలది గనుకనే విద్యనేర్చియు గృహసంబంధమగు పనులయందును, ఉన్ని సంబంధమయిన అల్లికల పనులయందును అన్ని విధములగు పనియందును బ్రవీణయై యున్నది. ప్రస్తుతమాంధ్రమహారాష్ట్ర దేశములలో వాడుకలో నున్న పక్వాన్నములలో గానీ పిండివంటలలో గానీ యీమెకు రానిదొక్కటియు లేదని చెప్పిన స్వభావోక్తియగునేగాని యతిశయోక్తి కానేరదు." (హిందూసుందరి 1903)

అచ్చమాంబకు ఆరుసంవత్సరాల వయసపుడు ఆమె తండ్రి కొమర్రాజు వెంకటప్పయ్య మరణించారు. అపుడు ఆమె తల్లి గంగమ్మ మునగాలలో బ్రతికే వీలులేక పిల్లలిద్దరిని

తీసుకుని తన అన్న పనిచేస్తున్న గ్రామానికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది. గంగమ్మ సవతి అన్న భండారు మాధవరావు అప్పటి నైజాము రాజ్యంలోని దేవరకొండ గ్రామంలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి అప్పటికే వివాహమై భార్య చనిపోయింది. కూతురు మీనాక్షితో దేవరకొండలో వుంటున్న మాధవరావు దగ్గరికి గంగమ్మ తన ఇద్దరు పిల్లలతో చేరింది. అచ్చమాంబ బాల్యం దేవరకొండలోనే గడిచింది. అయితే బాల్యం తీరకముందే గంగమ్మ అచ్చమాంబకు వివాహం చెయ్యాలని నిశ్చయించింది. పదేళ్ళు కూడా నిండని పసిపిల్ల అయిన అచ్చమాంబకు అప్పటికే భార్య చనిపోయి, ఒక బిడ్డను కూడా కలిగివున్న మేనమామ భండారు మాధవరావుతో దేవరకొండ గ్రామంలోనే అచ్చమాంబ వివాహం జరిగిపోయింది. బాల్యం వీడని పసిమొగ్గ కొమర్రాజు అచ్చమాంబ, వివాహితయై భండారు అచ్చమాంబగా మారిపోయింది.

## నాగపూర్ పయనం

వివాహానంతరం మాధవరావుకు దేవరకొండ నుండి, మహారాష్ట్రలోని నాగపూర్‌కు బదిలీ అయింది. నైజాం రాజ్యం నుండి మధ్య పరగణాకు భర్తతో కలిసి వెళ్ళింది. తల్లి, తమ్ముడు కూడా ఆమెతోపాటు బయలుదేరారు. అప్పటినుండి అచ్చమాంబ జీవనం నాగపూర్‌లోనే సాగింది. అప్పుడప్పుడు ఆంధ్రదేశానికి రావడం, మీటింగ్‌లలో పాల్గొనడం తప్ప అచ్చమాంబ ఎప్పుడూ ఇక్కడ నివసించలేదు.

**చదువు :** అచ్చమాంబను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించలేదు. ఆమెకు పదిపన్నెండేళ్ళు వచ్చేవరకు అక్షరజ్ఞానమే లేదు. చిన్నవయస్సులోనే తండ్రి చనిపోవడం, ఉన్న ఊరు వొదిలిపెట్టాల్సిరావడం, అతిచిన్నవయస్సులోనే వివాహం జరగడం అచ్చమాంబను చదువుకు దూరంచేసాయి. నిజానికి ఆమెకు చదువుపట్ల అమితాసక్తి వుంది. తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించకపోయినా అచ్చమాంబలో వున్న విద్యాభిలాష ఆమెను అక్షరాలకు దగ్గర చేసింది.

మగపిల్లవాడైనందున కొమర్రాజు లక్ష్మణరావుకు విద్య హక్కుగా అందుబాటులోకి వచ్చింది. ఉపాధ్యాయుడిని ఇంటికి పిలిపించి మరీ అతను చదువుకొనేలా ప్రోత్సాహమిచ్చింది తల్లి గంగమ్మ. అచ్చమాంబ తమ్ముడి చదువును, ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను శ్రద్ధగా గమనిస్తుండేది. తనంతట తాను ప్రేరణ పొందినదే గానీ ఎవ్వరి ప్రోత్సాహం ఆమెకు లేదు. వినికిడి ద్వారానే పాఠాలు నేర్చుకుని అచ్చమాంబ తమ్మునికంటే ముందే వాటిని వప్పచెబుతూండేది. లక్ష్మణరావును మించిన తెలివితేటలు ప్రదర్శించేది. కొన్నిరోజులు గడిచేటప్పటికి తెలుగు, హిందీ భాషలు నేర్చుకొంది. క్రమక్రమంగా సంస్కృతం, మరాఠీ, గుజరాతీ భాషలను నేర్చుకోగలిగింది.



"ఆమెయంత బుద్ధిసూక్ష్మము గలదయిన మన పద్ధతులను బట్టి యింగ్లీషు మొదలగు గొప్ప విద్యను నేర్చుకొనలేకపోయెను. తమ్ముడు ధనవంతుడగుటచే ఎం.ఏ. పట్టమునందెను." అని అచ్చమాంబ మరణించి నపుడు హిందూసుందరి సంపాదకీయంలో రాసింది.

తమ్ముడితో కలిసి చదువుకునే అవకాశం కూడా లేకుండా పోయింది అచ్చమాంబకు. భర్త ఉద్యోగరీత్యా ఆమె అతనితోపాటు తిరుగుతూ వుంటే లక్ష్మణరావు నాగపూర్‌లోనే వుంటూ తన చదువును కొనసాగించాడు. ఎం.ఏ. పాస్ అయ్యాడు. అచ్చమాంబ సంసార జీవితంలో మునిగిపోయింది. ఈ విషయాల గురించి తన అబలా సచ్చరిత్ర రత్నమాలలో ఈ విధంగా రాసింది.

స్త్రీలు నైసర్గిక మూర్ఖురాండ్రని చెప్పుట కంటే నేటివరకు స్త్రీలకు బాల్యము నుండియు విద్యాగణితమునించుక సోకనియ్యనందున వారు మూర్ఖురాండ్రుగా గానుపించెదరని చెప్పవచ్చును. బాలురకంటె బాలికలెప్పుడును బుద్ధిహీనులుగా నుండరు. బాల్యమునందాడుపిల్లయెట్టి బుద్ధి వైభవము గలదయినను తలిదండ్రులు దానికెంత మాత్రమును విద్యనేర్పక జ్ఞానాభివృద్ధికిందగిన యుపాయములేవియు జేయనందున నది వివేకహీనురాలగుచున్నది. బాలుడు చిన్నతనమునందెంత మందబుద్ధియైనను వానికైదేండ్లు రాగానే తలిదండ్రులు విద్య నేర్పి వానికి గల మాంద్యమును వదిలించి జ్ఞానాభివృద్ధి కొరకు శాస్త్రములు చదివింతురు. కాన వాడు మిక్కిలి ప్రజ్ఞావంతుడయి ప్రసిద్ధుడగును. చిన్ననాడు వానికంటే విశేషప్రజ్ఞగలవానియనేక్క మాత్రము విద్యాగంధమేమియు లేనందున మహా మూర్ఖశిరోమణియై యుండును. ఇట్లు తలిదండ్రుల పక్షపాతముచే బురుష సంతతిలోను స్త్రీసంతతిలోను జ్ఞానమును గురించి మహదంతరము పడినదే గానీ స్త్రీల స్వాభావిక మూర్ఖమువలన కాదు. కాన స్త్రీలకును బక్షపాతరహితులయి పురుషులు విశేషవిద్య నేర్పినచో స్త్రీలును అసామాన్య బుద్ధిచాతుర్యములను జూపి పురుషులకనేక విషయములలో సహాయముచేసి యర్ధాంగులన్న నామమును సార్థకపరుతురని నొక్కివక్కాణించుటకు సందేహము లేదు."

'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథం రాస్తూ అచ్చమాంబ ప్రకటించిన పై అభిప్రాయాలు ఎంత పురోగామి దృక్పథంతో వున్నాయో అర్థమౌతుంది. స్త్రీల వెనుకబాటుతనానికి, వారి అజ్ఞానానికి మూలకారణం వారికి జ్ఞానాన్ని అందివ్వకపోవడమేనని, తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల కనబరిచే వివక్షే దీనికి కారణమని చాలా స్పష్టంగా ప్రకటించింది. తాను విద్యకు దూరమై తన తమ్ముడు ఉన్నతవిద్య చదువుకోగలగడం వెనకవున్న కుటుంబ వివక్షను ఇంత సూటిగా విశ్లేషించిన అచ్చమాంబ బతికిన కాలాన్ని

పరిగణనలోకి తీసుకుంటే (పందొమ్మిదో శతాబ్దం) ఆమె ఆలోచనలు ఎంత తీక్షణమైనవో గమనించవచ్చు. ఆడపిల్లల్ని వివక్షతో పెంచవద్దని, వారికి విద్యాబుద్ధులు చెప్పించాలని, బాల్యవివాహాలు చెయ్యొద్దని తాను బతికినంత కాలం రాస్తూనో, చెబుతూనో వుంది అచ్చమాంబ. ఆనాడు అచ్చమాంబ అంత అభ్యుదయకరంగా ఆలోచించి, స్త్రీవిద్య గురించి గళమెత్తినా ఈనాటికీ అవే పరిస్థితులు కొనసాగడం, వందేళ్ళు గడిచినా మహిళల నిరక్షరాస్యత నిర్విఘ్నంగా కొనసాగడం గొప్ప విషాదం.

తిరిగి అచ్చమాంబ చదువులోకి వద్దాం. తమ్ముడి చదువు సమయంలో నేర్చుకున్న భాషల్ని వృథా పోనీయకుండా, తానుండే నాగపూర్ ప్రాంతంలో హిందీ, మరాఠీ భాషలు మాట్లాడే స్త్రీలతో కలిసి మరాఠీలో వుండే భక్తిసాహిత్యాన్ని చదివేది. చుట్టుపక్కలుండే మహిళల్ని ఇంటికి పిలిచి ఆయా భక్తికథల్ని వారికి చదివి వినిపించేది. ఆమె చుట్టూ ఎలాంటి తెలుగు వాతావరణం లేకున్నా, హిందీ, మరాఠీ మాట్లాడేవారే వున్నప్పటికీ అచ్చమాంబకు తెలుగుపట్ల వల్లమాలిన ప్రేమవల్ల మంచి తెలుగు వచనం రాయడం నేర్చుకుంది. తన తల్లికి భారత భాగవత రామాయణాలు చదివి వినిపించగలిగినంత భాషాజ్ఞానాన్ని అచ్చమాంబ సంపాదించింది. తెలుగు మాట్లాడని ప్రాంతాల్లో వుంటూనే చక్కటి వచనంలో పన్నెండు కథలు రాయగలిగిందంటే ఆమె పట్టుదల ఎలాంటిదో అర్థమవుతుంది. "హిందూ సుందరి" పత్రికకి తరచూ వ్యాసాలు పంపిస్తుండేది. ఆ వ్యాసాల నిండా స్త్రీవిద్య గురించి, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి చర్చించేది అచ్చమాంబ. హిందూసుందరి, సావిత్రి, సరస్వతి, తెలుగు జనానా పత్రికల్లో అచ్చమాంబ కథలు ప్రచురితమయ్యేవి.

అచ్చమాంబ చదువు నేర్చుకోవడం సాంప్రదాయభావాలుండే భర్త మాధవరావుకు నచ్చేది కాదు. ఆమె చదువుకోరాదని అభ్యంతరాలు పెట్టేవాడు. చదువుకుంటే స్త్రీలు చెడిపోతారని అతని నిశ్చితాభిప్రాయం. అతనింట్లో లేనపుడు, క్యాంపులకు వెళ్ళినపుడు పుస్తకాలు చదువుతుండేది. మాధవరావుకు ధార్మిక విషయాల పట్ల వుండే ఆసక్తి వల్ల ఆర్యసమాజానికి సంబంధించిన అనేక గ్రంథాలు ఇంట్లో వుండేవి. ధర్మం, తత్త్వం గురించి ఆ పుస్తకాలలో చాలా సమాచారముండేది. ఆ పుస్తకాలను చదివేది. మరాఠీ భాష నేర్చుకున్నందున సంఘ సంస్కరణకు సంబంధించిన మరాఠీ గ్రంథాల నెన్నింటినో అచ్చమాంబ చదివింది. ముఖ్యంగా మరాఠీలో ప్రముఖ గ్రంథమైన, ఒక స్త్రీ రాసిన 'ఆనందీబాయి చరిత్రము' అచ్చమాంబ మీద చాలా ప్రభావం చూపింది. ఈ గ్రంథం చదివిన తర్వాత అచ్చమాంబ ఆలోచనల్లో కొట్టొచ్చిన మార్పు కనిపిస్తుంది. స్త్రీవిద్య, స్త్రీ



స్వాతంత్ర్యాలను గురించి చాలా ఆలోచించేది. ఈ పుస్తక ప్రభావం అబలా సచ్చరిత్ర రత్నమాలలో ప్రస్ఫుటంగా కనబడుతుంది. మరాఠీ సాహిత్య అధ్యయనం వల్ల అక్కడి సంస్కరణవాదం, జనజాగరణ ఉద్యమ ప్రభావం అచ్చమాంబ మీద బలంగానే పడింది.

తన చదువును వ్యతిరేకించిన భర్తను నొప్పించకుండానే అతని పరోక్షంలో తన గ్రంథపఠనం కొనసాగించిన అచ్చమాంబ భర్తతో సామరస్యంగానే వుండేది. అతనికి కావలసిన సేవలు చేసేది. అతని వ్యతిరేకతని సహనంతోనే ఎదుర్కొని అతనిలో మార్పు వస్తుందని ఆశించేది. తన ప్రవర్తనతో మాధవరావు మనస్సును మార్చింది కూడా. ఈ మార్పువల్లనే ఆ తరువాత ఆమె చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. శెలవుల్లో ఆంధ్రాకి వచ్చినపుడు ఆమె సమావేశాలు, ఉపన్యాసాల్లో మునిగి తేలుతుండేది. స్త్రీలకోసం సంఘాలను స్థాపించింది.

చిన్నవయసులోనే వివాహం చెయ్యడం వల్ల, కుటుంబంలో ఆడ, మగపిల్లల మధ్య వ్యత్యాసం చూపడం వల్ల తాను చదువుకొనలేకపోయాననే అవగాహన అచ్చమాంబకు స్పష్టంగానే ఏర్పడింది. పైగా సంసారభారం, భర్త నుంచి వుండనే వున్నాయి. అయినప్పటికీ విద్యపట్ల గొప్ప వ్యామోహంతో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుండేది అచ్చమాంబ. చదివిన విషయాల ప్రభావంతో ఏదో ఒకటి రాస్తూ వుండేది. వేసవి శెలవుల్లో లక్ష్మణరావు తమ ఇంటికి వచ్చినపుడు ఎన్నో పుస్తకాలు తెచ్చేవాడు. అతనిని కొత్త కొత్త విషయాలు చెప్పమని అడుగుతుండేది. తమ్ముడు చెప్పే కొత్త సంగతుల ద్వారా తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేది. ఈ విధంగా అచ్చమాంబ తన కృషి, ప్రయత్నాల ద్వారా విద్యను అభ్యసించింది గాని ఎవరి ప్రోత్సాహం వల్లను కాదు. భర్త తన చదువును అభ్యంతరపెట్టినప్పటికీ అచ్చమాంబ తన గ్రంథం "అబలా సచ్చరిత్ర రత్నమాల"ను తననెంతో ప్రోత్సహించిన వాడిగా పేర్కొంటూ అతనికే అంకితమిచ్చింది.

"అటు ప్రాచీనమైన సతీధర్మమును ఇటు నవీనమైన పాశ్చాత్య విద్యాసంస్కారమును నీరెండింటిని అత్యద్భుతముగా అనుపమానముగా ప్రదర్శించి ఆదర్శ మహిళ అయినది" అని "సావిత్రి" పత్రికను నడిపిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ ప్రశంసించింది.

## సాహితీవ్యాసంగం

అచ్చమాంబ ఎప్పుడు రచనావ్యాసంగం చేపట్టిందో తెలిపే స్పష్టమైన ఆధారాలేమీ లేవు. ఆమె తన 24వ ఏట నుండే రచనలు ప్రారంభించినట్టు కొన్ని రచనలవల్ల అర్థమవుతోంది. ఈమె రచనలు ఎక్కువగా హిందూసుందరి పత్రికలో ప్రచురితమవుతూండేవి. అచ్చమాంబ రాసిన కథలు తెలుగు జనానా, హిందూసుందరి, సావిత్రి పత్రికలలో కూడా ప్రచురితమవుతూండేవి. అచ్చమాంబ రాయడం ఎప్పుడు మొదలుపెట్టిందో చెప్పలేము

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=992](http://kinige.com/kbook.php?id=992)**

* * *